విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

రుణమాఫీ పేరిట మోసం

- సీఎంది ఒక మాట. .మంత్రులది మరో మాట
- ఏకకాలంలో చేస్తున్నామనడం విడ్డూరం
- రైతుబంధు ఎగనామానికి పన్నాగం
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కరీంనగర్ కార్పొరేషన్, జూలై 20: అధికారంలోకి వచ్చిన వెంటనే రుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఏడు నెలల తర్వాత కొందరికే వర్తింపజేసి రైతులను మోసం చేసిందని అని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ధ్వజమెత్తారు. ఏకకాలంలో మాఫీ చేస్తున్నామని సీఎం రేవంత్ పచ్చి అబద్ధాలు చెబుతున్నారని నిప్పులు చెరిగారు. ఈ విషయంలో సీఎం ఒకటి మాట్లాడితే.. మంత్రులు మూడు విడుతల్లో అంటూ మరో మాట మాట్లాడుతూ ఆగం చేస్తున్నారని మండిపడ్డారు. కరీంనగర్ లోని 37వ డివిజన్ బీఆర్ఎస్ ఆఫీసులో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కేసీఆర్ సర్కారు పదేండ్లలో రెండుసార్లు లక్ష చొప్పున రైతులకు రుణమాఫీ చేసిందని గుర్తు చేశారు. 2018లో ₹19వేల కోట్లను 38లక్షల రైతుల్లో ఖాతాల్లో జమచేసిన ఘనత ఆయనకే దక్కిందని కొనియాడారు. కానీ రేవంత్‌రెడ్డి డిసెంబర్ 9నే ₹2లక్షల రుణమాఫీ ఫైల్‌పై సంతకం చేస్తానని చెప్పి, ఏడు నెలల తర్వాత కొత్త నాటకానికి తెరతీశాడన్నారు. చొప్పదండి నియోజకవర్గంలోని రైతు నల్ల నర్సింగరెడ్డికి కేవలం ₹3 వేలే మాఫీ అయిందని, మరో రైతు పద్మకు ₹6 వేల వడ్డీ కడితేనే ₹30 వేలు మాఫీ చేస్తామని బ్యాంకు అధికారులు చెబుతున్నారన్నారు. ఇలా లక్షలాది మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సీఎం రైతుభరోసా నిధులను రుణమాఫీకి మళ్లించాడని ఆరోపించారు. ఈ వానకాలం రైతుభరోసా ఎగ్గొట్టేందుకు కుట్రలు చేస్తున్నాడని విమర్శించారు. అబద్ధాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు అబద్ధాలతోనే పాలన సాగిస్తున్నదన్నారు. ఇప్పటికైనా రైతు భరోసాను విడుదల చేయాలని, కౌలు రైతులు, రైతు కూలీలకు వర్తింపజేయాలని, రుణమాఫీకి షరతులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ గ్రంథాలయ చైర్మన్, పొన్నం అనిల్‌కుమార్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సమావేశం అనంతరం ఉమ్మడి జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమీక్షా సమావేశం

కోర్టుచౌరస్తా, జూలై 20: తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాల మేరకు శనివారం ఉమ్మడి జిల్లాలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వింజమూరి వెంకటేశ్వర్లు కరీంనగర్ జిల్లా కోర్టులో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఇందులో ప్రాసిక్యూటర్ల సమస్యలు, వారు లెవనెత్తిన సందేహాలపై చర్చించారు. విచారణకు వచ్చే క్రిమినల్ కేసులపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నిందితులకు శిక్ష పడేలా వాదనలు వినిపించాలన్నారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మురళీధర్ రావు నూతన చట్టాల గురించి వివరించారు. అనంతరం ఇటీవల కరీంనగర్ నుంచి హుజూరాబాద్‌కు బదిలీ అయిన వసంత, మంథని నుంచి మెట్‌పల్లికి ట్రాన్స్‌ఫర్ అయిన ప్రణయ్‌ను సన్మానించారు. సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ఆరెల్లి రాములు, జూలూరి శ్రీరాములు, గౌరు రాజిరెడ్డి, గడ్డం లక్ష్మణ్, పెంట శ్రీనివాస్, లక్ష్మీ ప్రసాద్, శరత్ పాల్గొన్నారు.

'రైతు భరోసా'కు ఎగనామం

₹లక్ష రుణమాఫీ చేశామని చెప్పారు • ₹2 లక్షలు మాఫీ చేస్తున్నట్టు ప్రకటనలు ఇచ్చారు
అబద్ధాలతో అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ • మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజం

జగిత్యాల, జూలై 20 : రైతులకు పెట్టుబడి కోసం యాసంగి, వానకాలం ఇవ్వాల్సిన 'రైతు భరోసా'కు కాంగ్రెస్ సర్కారు ఎగనామం పెట్టిందని, ఆ నిధులతోనే ప్రస్తుతం రుణమాఫీ చేస్తున్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజమెత్తారు. అబద్ధాలు చెప్పి కాంగ్రెస్ అధికారం దక్కించుకున్నదని, రూ.లక్ష రుణమాఫీ చేశామని చెబుతూనే.. ₹2 లక్షలు మాఫీ చేస్తున్నట్టు పత్రికా ప్రకటనలు ఇస్తున్నారని మండిపడ్డారు. జగిత్యాలలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు రుణమాఫీ చేసినట్టు పత్రికా ప్రకటనలకే కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నదని విమర్శించారు. యాసంగి, వానకాలంలో రైతు భరోసా కింద రైతులకు, కౌలు రైతులకు ₹15 వేలు, రైతు కూలీలకు ₹12 వేలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఈ సొమ్ము ₹20 వేల కోట్లకుపైనే ఉంటుందని, దానిని ఎగ్గొట్టి ఆ డబ్బులో కొంత భాగాన్ని రుణమాఫీకి మళ్లించి రైతులకు మేలు చేసినట్టు రేవంత్‌రెడ్డి ప్రచారం చేసుకుంటున్నడని మండిపడ్డారు. రైతు బంధు కింద జూన్‌లో ఇవ్వాల్సిన నిధుల నుంచే ₹7వేల కోట్లు రుణమాఫీకి మళ్లించారని, 40 లక్షల పైచిలుకు రైతులు ₹లక్ష వరకు రుణాలు తీసుకుంటే కేవలం 11 లక్షల మందినే ఎలా ఎంపిక చేస్తారని ప్రశ్నించారు. 2014, 2018లో కేసీఆర్ సర్కార్ రుణమాఫీతో పోలిస్తే పావువంతు రైతులకే అర్హత ఉన్నదా..? అని అడిగారు. 2014లోనే కేసీఆర్ సర్కార్ ₹లక్షలోపు రుణాలను మాఫీ చేయడానికి ₹16,144 కోట్లు వెచ్చించిందని, సుమారు 35 లక్షల రైతులకు లబ్ది చేకూర్చిందన్నారు. 2018లో అదే లక్షలోపు రుణమాఫీకి ₹19,198 కోట్లు అంచనా కాగా, మొత్తం లబ్ధిదారుల సంఖ్య సుమారు 37లక్షలు అని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు యాసంగిలో రైతుబంధు ₹2వేల కోట్లు ఎగ్గొట్టారని, వానకాలం రైతు భరోసా ఊసే లేదని, కోటి 30 లక్షల ఎకరాలకు ఇస్తారనుకున్నా, ఎకరాకు ₹7500 చొప్పున ₹10 వేల కోట్లు ఎగ్గొట్టారన్నారు. పాస్‌బుక్ ప్రామాణికమైతే మళ్లీ రేషన్ కార్డు ఎందుకు అని ప్రశ్నించారు. రుణమాఫీకి రేషన్ కార్డు నిబంధన పెడితే కుటుంబంలో ఒక రైతుకు మాత్రమే రుణమాఫీ వర్తిస్తుందని, తద్వారా మరో 18 లక్షల మంది రైతులు తగ్గే అవకాశమున్నదని, ప్రభుత్వోద్యోగులు, ఇన్ కంట్యాక్స్ చెల్లించేవారు ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను మినహాయిస్తే, మరో 2 లక్షల మంది తగ్గుతారని, వీరందరినీ తొలగింపు ద్వారా 40 లక్షల మంది మేరకే రుణమాఫీ పథకం పరిధిలోకి వస్తారన్నారు. బ్యాంకుల నుంచి తీసుకున్న ఆయా రుణాల మొత్తాన్ని చెల్లించి, 'డిఫాల్టర్ల' జాబితా నుంచి రైతులను తొలగించి కొత్తగా రుణాలు మంజూరు చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రుణమాఫీకి పట్టాదారు పాసుబుక్ ప్రాతిపదిక అని ముఖ్యమంత్రి స్పష్టత ఇచ్చారని, దీని ప్రకారం పాస్ బుక్ ఉన్న ప్రతి రైతుకు ₹2 లక్షల రుణమాఫీ చేయాలన్నారు. ఒకే వేదికపై రుణమాఫీ గురించి మంత్రులు తలోమాట చెప్పారని, అబద్ధాలు ఆడుతూ అడ్డంగా దొరికారని మండిపడ్డారు. భట్టి విక్రమార్క రుణమాఫీకి ₹6 వేల కోట్లు విడుదలయ్యాయని, తుమ్మల నాగేశ్వరరావు రుణమాఫీకి ₹31 వేల కోట్లు విడుదల అయ్యాయని అంటున్నారని, ఇందులో ఏది నిజమో వారికే తెలియాలన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పక్కన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

షుగర్ ఫ్యాక్టరీపై వేసిన కమిటీ తీసుకున్న చర్యలేంటి?

బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

నిజాంషుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ విషయంలో వేసిన కమిటీ ఏం చర్యలు తీసుకున్నదో రేవంత్ ప్రభుత్వం చెప్పాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు డిమాండ్ చేశారు. తమ పార్టీ నాయకులను కాంగ్రెస్ సర్కారు భయభ్రాంతులకు గురి చేస్తున్నదని, అయినా వెనక్కి తగ్గేది లేదని, యువతను ప్రోత్సహిస్తూ పార్టీని ముందుకు తీసుకు వెళ్తామని స్పష్టం చేశారు. 2020-23 వరకు టీటీడీ డైరెక్టర్‌గా తాను బాధ్యతలు చేపట్టిన సమయంలో చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సహకారంతో జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి, సిద్దిపేట, మంచిర్యాల, వేములవాడ, ఖానాపూర్ నియోజకవర్గాల్లో 94 ఆలయాలకు నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. అనంతరం జగిత్యాల నియోజకవర్గంలోని తొమ్మిది ఆలయాల అభివృద్ధి కోసం టీటీడీ ద్వారా మంజూరైన ₹90 లక్షలకు సంబంధించిన పత్రాలను దేవాలయాల కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావుతోపాటు జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతను దేవాలయ కమిటీల సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ జడ్పీటీసీలు కొల్ముల రమణ, గోస్కుల జలంధర్, ప్యాక్స్ చైర్మన్ మాధవరావు, మున్నూరు కాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్ల రమణ, కౌన్సిలర్లు అవారి శివకేసరిబాబు, శ్రీధర్‌రెడ్డి, అనిల్, మహేందర్, సాయి, సత్యనారాయణ, పట్టణ ఉపాధ్యక్షుడు వొల్లెం మల్లేశం, రాయికల్ మండల మహిళా అధ్యక్షురాలు స్పందన, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉదయ శ్రీ, వైస్ చైర్మన్ మల్లేశ్, నాయకులు పాల్గొన్నారు.

తుది అంకంలో బదిలీ ప్రక్రియ!

కరీంనగర్ కలెక్టరేట్, జూలై 20 : ఉద్యోగుల బదిలీల ప్రక్రియ తుది అంకానికి చేరింది. బదిలీల షెడ్యూల్ విడుదలైన తర్వాత ఇచ్చుకున్న ఆప్షన్ల మేరకు శనివారం మధ్యాహ్నం నుంచి బదిలీ ఉత్తర్వులు మెయిల్ ద్వారా అందినట్టు తెలుస్తున్నది. వాటి ప్రకారమే కేటాయించిన స్థలంలో సోమవారం వరకు విధుల్లో చేరాల్సి ఉంటుంది. ఇప్పటికే మెయిల్ ద్వారా బదిలీ ఉత్తర్వులు అందుకున్న ఉద్యోగులు విధుల్లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. పలు ప్రభుత్వ విభాగాల్లో అటెండర్ స్థాయి నుంచి అధికారి వరకు కూడా బదిలీ ఉత్తర్వులు అందుతుండగా, పారదర్శకంగా బదిలీలు పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, కొంతమంది ఉద్యోగులు మాత్రం రాజకీయ పలుకుబడిని ఉపయోగించారనే విమర్శలు వస్తున్నాయి. అలాగే, మరికొందరు సంఘాల ప్రాపకంతో బదిలీల నుంచి మినహాయింపు పొందినట్టు ఆయా శాఖల నుంచే ఆరోపణలు వస్తున్నాయి. ఏదేని ఉద్యోగ సంఘ కార్యవర్గంలో కొనసాగుతున్న వారికి కూడా బదిలీల్లో మినహాయింపు లేదు. కానీ, కొంతమంది పలు సంఘాల లెటర్‌హెడ్‌లతో తప్పుడు సిఫారసు లేఖలు అందించి, బదిలీలు నిలుపుకున్నట్టు తెలుస్తుండగా, వీటిని అధికారులు కొట్టిపారేస్తున్నారు. కాగా, పలు శాఖల్లో బదిలీ అయిన వారి స్థానాలు యథావిధిగా భర్తీ చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో 25 ప్రభుత్వ శాఖల్లో బదిలీల పర్వం జరుగుతుండగా, ప్రధాన విభాగాల్లో ప్రస్తుతం బదిలీ అయిన సిబ్బంది సంఖ్యకు అనుగుణంగా తిరిగి కేటాయించడం లేదని తెలుస్తున్నది. స్థానచలన ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే కొనసాగుతుండగా, ఎంత మందికి బదిలీ జరిగింది? ఎంత మందిని కేటాయించారు? అనేది బదిలీ అయిన ఉద్యోగులు విధుల్లో చేరిన అనంతరమే తెలుస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. బుధవారం వరకు దీనిపై క్లారిటీ వచ్చే అవకాశముందని వెల్లడిస్తున్నారు. కాగా, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, నీటి పారుదల, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల్లో సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, అటెండర్లు, షరాబులుగా కొనసాగుతున్న వారికి, అలాగే మహిళా,శిశు సంక్షేమ శాఖలో సీడీపీవోలు, ఏసీడీపీవోలు, గ్రేడ్-1, గ్రేడ్-2 సూపర్‌వైజర్‌లకు స్థానచలనం జరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

విద్యార్థులకు సిరిసిల్ల కలెక్టర్ పాఠాలు

విద్యార్థులకు పాఠాలు చెప్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

రాజన్న సిరిసిల్ల, జూలై 20 (నమస్తే తెలంగాణ) : నిత్యం పరిపాలన కార్యక్రమాల్లో ఎప్పుడూ బిజీబిజీగా ఉండే రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కాసేపు టీచర్‌గా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. శనివారం జిల్లా కేంద్రంలోని గీతానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 8, 9, 10 తరగతి గదులకు వెళ్లి విద్యార్థులు చదువుకుంటున్న తీరును పరిశీలించారు. పాఠ్యాంశాల్లోని పలు ప్రశ్నలు అడిగారు. వారిచ్చిన సమాధానాలకు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంగ్లిష్, గణితం, భౌతిక శాస్త్రాల్లో వెనుకబడి ఉండడం చూసి ఆయనే స్వయంగా బ్లాక్ బోర్డుపై రాస్తూ పాఠాలు బోధించారు. ఈ సబ్జెక్ట్‌లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యార్థులు రాణించేలా చొరవ తీసుకోవాలని హెచ్ఎం శారదను ఆదేశించారు. అనంతరం పాఠశాలలోని వంటశాలను సందర్శించి, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం వివరాలు అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్లను పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరమ్మతులు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించి ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరైన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డీఈవోను ఆదేశించారు.

వాణిజ్య

అబ్దుల్ కలామ్ టెక్నికల్ వర్సిటీ ప్రతినిధులతో టీ హబ్‌వర్గాలు

టీ హబ్‌తో అబ్దుల్ కలామ్ వర్సిటీ జట్టు!

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 20 (నమస్తే తెలంగాణ): టీ హబ్‌తో కలిసి పనిచేసేందుకుగాను ఉత్తరప్రదేశ్‌కు చెందిన డాక్టర్ అబ్దుల్ కలామ్ టెక్నికల్ యూనివర్సిటీ ప్రతినిధుల బృందం ముందుకొచ్చింది. రెండు రోజులపాటు టీ హబ్ కార్యకలాపాలను పరిశీలించిన ప్రతినిధుల బృందం శనివారం..అక్కడ ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు అవసరమైన అనుకూల వాతావరణాన్ని కల్పించేందుకు టీ హబ్‌తో కలిసి పనిచేయనున్నట్లు అబ్దుల్ కలామ్ టెక్నికల్ యూనివర్సిటీ ప్రతినిధులు ప్రకటించారు. అంతర్జాతీయ మార్కెట్‌కు అవసరాలకు అనుగుణంగా రూపొందించడంలో టీ హబ్ దూసుకుపోతున్నదని, తమ యూనివర్సిటీలో ఆవిష్కరణలను ప్రోత్సహించేలా త్వరలో ఎంవోయూ కుదుర్చుకోనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ప్రైవేట్ రంగంలోని కార్పొరేట్ సంస్థలతోపాటు ప్రభుత్వరంగ సంస్థలు కూడా తమతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాయని టీ హబ్ ప్రతినిధి వెల్లడించారు. స్టార్టప్‌లకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు టీ హబ్ ద్వారా లభిస్తున్నాయని..అలాగే దేశ, విదేశాలకు చెందిన పలు సంస్థలు సందర్శించడంతో పాటు కలిసి పనిచేసేందుకు వ్యూహాత్మక ఒప్పందాలను కుదుర్చుకుంటున్నాయని తెలిపారు.

పీఎస్‌యూలకు ముప్పుతప్పినట్టేనా?

ప్రైవేటీకరణపై వెనక్కి తగ్గనున్న ఎన్డీఏ సర్కారు

రాష్ట్రంలోని ఆరు ప్రభుత్వ సంస్థలకు కొత్త ఆశలు

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వరంగ సంస్థలను పూర్తిగా వదిలించుకోవాలని చూస్తున్న నరేంద్ర మోదీ సర్కార్ ఈసారికి కాస్త వెనుకడుగు వేసే అవకాశాలున్నాయి. పూర్తిస్థాయిలో మెజార్టీ రాకపోవడం, మరోవైపు ఎన్‌డీఏ భాగస్వామ్య పార్టీల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో పీఎస్‌యూల ప్రైవేటీకరణపై మోదీ ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తున్నది. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక ప్రైవేటీకరణపై అత్యంత దూకుడుగా వ్యవహరించింది. ఫలితంగా దేశవ్యాప్తంగా 35 పీఎస్‌యూలు ప్రైవేటుపరం అయ్యాయి. మారిన రాజకీయ పరిణామాలతో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఎదురు దెబ్బ తగలడంతో సంకీర్ణ సర్కారు తమ ప్రాధాన్యతలను మార్చుకున్నట్లు తెలుస్తున్నది. ఎన్‌డీఏ భాగస్వామ్యపక్షాలు ప్రైవేటీకరణకు ఒప్పుకునే అవకాశాలు లేకపోవడంతో మోదీ సర్కారు మరో కీలక నిర్ణయం తీసుకోబోతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టనున్న సార్వత్రిక బడ్జెట్‌లో ప్రైవేటీకరణకు మొగ్గుచూపకుండా..కేవలం వాటాని పునరుద్ధరించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఇందుకు సంబంధించి ఇటీవల పలువురు కేంద్ర మంత్రుల వ్యాఖ్యలు కూడా ఇందుకు బలంచేకూరుతున్నది. దీంట్లోభాగంగా రాష్ట్రంలో ఉన్న ఆరు ప్రభుత్వరంగ సంస్థలకు ఉపశమనం లభించే అవకాశాలున్నాయి.

రాష్ట్రంలో ప్రైవేటీకరణకు ప్రతిపాదిత సీపీఎస్‌యులు, వాటి ఆధీనంలోని భూములు(ఎకరాల్లో)..

1. హిందుస్థాన్ కేబుల్స్ లిమిటెడ్(హెసీఎల్)	-	324.87
2. హిందుస్థాన్ ఫ్లోరోకార్బన్స్ లిమిటెడ్	-	126.32
3. ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్(ఐడీపీఎల్)	-	551.03
4. హెచ్ఎంటీ వాచెస్	-	888.05
5. సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సీసీఐ)	-	2,272.85
6. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ	-	3,020
	మొత్తం -	7,183.12 ఎకరాలు

మూతపడిన 10 సంస్థలు..

రాష్ట్రవ్యాప్తంగా పది ప్రభుత్వరంగ సంస్థలు మూతపడ్డాయి. ఒకానొక దశలో 27 సంస్థలు ఇక్కడ కార్యకలాపాలను కొనసాగించగా, ఆర్థిక ఇబ్బందులు, నిధులు కేటాయింపులు లేకపోవడంతో పది సంస్థలు మూతపడ్డాయి. దీంతో వీటి సంఖ్య 17కి పరిమితమయ్యాయి. ఈ మూతపడిన పది సంస్థల్లో ఆరింటిని పూర్తిగా వదిలించుకోవాలని కేంద్ర సర్కార్ గతంలోనే ఎత్తుగడ వేసింది. కానీ కేసీఆర్ సర్కార్ తీవ్రంగా వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గింది. అయితే నిబంధనల ప్రకారం రాష్ట్రంలో ఉన్న కంపెనీల భూములను విక్రయించాలంటే సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదం తెలుపాల్సి వుంటుంది. ఈ క్రమంలోనే ఆరు సీపీఎస్‌యూల ప్రైవేటీకరణకు ఆమోదం తెలుపాలని రాష్ట్ర సర్కార్‌పై కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకొచ్చింది.

హెచ్ఎంటీ తెరుచుకునేనా..

ఒకప్పుడు దేశానికి సమయం చూపించిన హెచ్ఎంటీ ప్రస్తుత ఆర్థిక సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నది. పీఎస్‌యూలను పట్టించుకోకుండా ప్రైవేట్ రంగ సంస్థలనే ప్రోత్సహిస్తున్న కేంద్ర సర్కార్ అనాలోచిత నిర్ణయాలతో ఎన్నో సంస్థలు మూతపడ్డాయి. వీటిలో దేశానికి సమయం చూపించిన హెచ్ఎంటీ కూడా ఉన్నది. ఒకప్పుడు హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగించిన ఈ సంస్థ తయారు చేసిన గడియారాలే ఎక్కువగా అమ్ముడయ్యాయి. ఆ తర్వాతి క్రమంలో ప్రైవేట్ రంగ సంస్థలనుంచి పోటీ పెరగడం, నిధులు కేటాయింపులు తగ్గిపోవడంతో ఉత్పత్తిని నిలిపివేసింది. దీంతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ఇటీవల కాలంలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమార స్వామి రాష్ట్ర పర్యటన సందర్భంగా హెచ్ఎంటీ ప్లాంట్‌ను కూడా సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద మంత్రితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. హెచ్ఎంటీని పునరుద్ధరించి తమ ఉద్యోగాలు కాపాడాలని, తమకు రావాల్సిన ప్రయోజనాలను అందించాలని కోరారు. దీనిపై కుమార స్వామి సానుకూలంగా స్పందించారు. హెచ్ఎంటీ పునరుద్ధరించడంతోపాటు ఆక్రమణకు గురవుతున్న హెచ్ఎంటీ భూములను కాపాడుతామని ఆయన హామీ ఇచ్చారు.

ఎల్ఐసీ దూకుడు

74 శాతం రిటర్నుపంచిన సంస్థ

న్యూఢిల్లీ, జూలై 20: దేశీయ బీమా దిగ్గజం ఎల్ఐసీ మళ్లీ తన పూర్వవైభావాన్ని సంతరించుకుంటున్నది. స్టాక్ మార్కెట్లో అడుగుపెట్టిన మొదట్లో భారీగా పతనమైన కంపెనీ షేరు తిరిగి నేలకు కొట్టిన బంతిలా దూసుకుపోతున్నది. గడిచిన ఏడాదికాలంలో అత్యధికంగా రిటర్నులు పంచిన షేరు ఎల్ఐసీదే కావడం విశేషం. దేశీయ టాప్-10 దిగ్గజ సంస్థల్లో ఎల్ఐసీ షేరు 74 శాతం రిటర్నులు పంచింది. దేశీయ టెలికం దిగ్గజాల్లో ఒకటైన భారతీ ఎయిర్‌టెల్ 68 శాతం రిటర్నులు పంచగా..బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) 47.64 శాతం రిటర్నులు పంచింది. స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల వద్ద ఉన్న సమాచారం మేరకు ఈ విషయం వెల్లడైంది. దేశీయ అత్యంత విలువైన రిలయన్స్ ఇండస్ట్రీస్ కేవలం 10 శాతం మాత్రమే మార్కెట్ విలువ పెరగగా.. ఐసీఐసీఐ బ్యాంక్ 28 శాతం, టీసీఎస్ 25 శాతం, ఇన్ఫోసిస్ 22 శాతం చొప్పున బలపడ్డాయి.

గతేడాదికాలంలో సంస్థల షేర్ల పెరుగుదల రూపాయల్లో..

కంపెనీ	19 జూలై 19 2023 నాటికి	నాటికి జూలై 2024	తేడా (శాతంలో)
ఎల్ఐసీ	620.4	1,080.1	74.10
భారతీ ఎయిర్‌టెల్	869.8	1463	68.20
ఎస్బీఐ	601.35	887.85	47.64
ఐసీఐసీఐ బ్యాంక్	973.65	1248.15	28.19
టీసీఎస్	3,471	4,330.25	24.76
ఇన్ఫోసిస్	1,474.35	1,807.7	22.61
రిలయన్స్	2,840	3,138.35	10.51
హెచ్‌యూఎల్	2,671.75	2,725	1.99
ఐటీసీ	478.85	475.05	-0.79
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1,684.85	1,613.9	-4.21

'బిల్డర్లకు రాయితీలివ్వండి'

వచ్చే బడ్జెట్‌పై క్రెడాయ్

న్యూఢిల్లీ, జూలై 20: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోతున్న సార్వత్రిక బడ్జెట్‌లో గృహ కొనుగోలుదారులకు, తక్కువ ధరతో ఇండ్లను నిర్మించే బిల్డర్లకు మరిన్ని పన్ను ప్రయోజనాలు కల్పించాలని రియల్టీ బాడీ క్రెడాయ్ కోరుతున్నది. రియల్ ఎస్టేట్ రంగం మళ్లీ గాడినపడాలంటే కేంద్ర ప్రభుత్వం మరిన్ని ప్రోత్సాహక నిర్ణయాలు తీసుకోవాలని, ముఖ్యంగా పన్ను రాయితీలు కల్పించినప్పుడే ఈ రంగ సంస్థలు ఆర్థికంగా నిలదొక్కుకోగలిగే అవకాశాలున్నాయని పేర్కొంది. కొత్తగా గృహాలు కొనుగోలుచేసేవారికి వడ్డీ రాయితీని పెంచాలని, అలాగే మళ్లీ క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ స్కీంను ప్రవేశపెట్టాలని, అప్పుడే చౌక ధర కలిగిన గృహాలకు డిమాండ్ ఉంటుందని క్రెడాయ్ ప్రెసిడెంట్ బొమన్ ఇరానీ తెలిపారు. ప్రస్తుతం రూ.2 లక్షలుగా ఉన్న డిడెక్షన్‌ను రూ.5 లక్షలకు పెంచాలని ఆర్థిక మంత్రిత్వ శాఖను కోరుతున్నట్లు చెప్పారు.

బడ్జెట్ (2024-25)

నిరాశపరిచిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

క్యూ1లో రూ.16,474 కోట్ల లాభం

ముంబై, జూలై 20: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నిరాశజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.16,474 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.12,370 కోట్ల లాభంతో పోలిస్తే 33 శాతం ఎగబాకగా, జనవరి-మార్చి త్రైమాసికంలో వచ్చిన లాభంతో పోలిస్తే మాత్రం 6.5 శాతం తగ్గింది. బ్యాంక్ ఆదాయం మాత్రం రూ.57,816 కోట్ల నుంచి రూ.83,701 కోట్లకు ఎగబాకింది.

- నికర వడ్డీ ఆదాయం 2.